www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 18 సెప్టెంబర్ 2023

5 తూర్పుగోదావరి



పర్యావరణహిత పూల గణపతి

ప్రజాశక్తి - కడియం

మండలంలోని కడియపులంక శ్రీ సత్యదేవా (పుల్లా ఆంజనేయులు) నర్సరీలో పలు రకాలతో కూడిన కొన్ని వేల పూలతో వినాయ కుని బొమ్మని రూపుదిద్దారు. ఈ సందర్భంగా నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులు మాట్లాడుతూ అందరూ మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణ కాలుష్యాన్ని అరికడదాం, రాబోయే తరాలవారికి పచ్చని వాతావరణాన్ని అందిద్దాం అని తెలిపారు



వెట్టి చాకిరి..తప్పని ఇక్కట్లు..

- ఆందోళనలో ఆర్పీలు, యానిమేటర్లు
- పది రెట్లు పెరిగిన పనిభారం
- వేతనాల చెల్లింపుల్లో నిర్లక్ష్యం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

మెప్మా విభాగంలో పనిచేస్తున్న రిసోర్స్‌పర్సన్‌లు, డిఆర్‌డిఎ పరిధిలో పనిచేస్తున్న యానిమేటర్లతో రాష్ట్ర ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తోంది. పట్టణాలలో నివసించే పేదలను డ్వాక్రా గ్రూపులుగా ఏర్పాటు చేసి ఆర్థిక అభివృద్ధికి క్షేత్రస్థాయిలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అదే విధంగా ఆర్పీలు, యానిమేటర్లు సైతం 10 రకాల విధులు నిర్వర్తిస్తున్నారు. కార్మిక చట్టాల ప్రకారం ఎనిమిది గంటల పని విధానం, కనీస వేతనాలు అమలు చేయడం, వేతనాల చెల్లింపులోనూ పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే ఆర్పీలు, యానిమేటర్లు ఆందోళన బాటపట్టారు. ప్రభుత్వ హామీలు అమలు కాకపోవడం, పని భారం అధికమవ్వడం వంటి కారణాలతో ఆర్పీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వాలు అనేక ఇబ్బందులకు గురి చేసింది. వైసిపి ప్రభుత్వం తమకు ఊరట కలిగిస్తుందని ఆశించా మని, అయితే వేతన కష్టాలకు తోడుగా పనిభారం వెంటాడుతోందని రాజమహేంద్రవరానికి చెందిన ఓ రిసోర్స్ పర్సన్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా వేతనాలు చెల్లించాలని, పని భారం తగ్గించాలని వేడుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితి లేదు.

జిల్లాలో సుమారు 1000 మంది

పట్టణాలలో మెప్మా విభాగంలో, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో సుమారు 350 మంది రిసోర్స్ పర్స న్లుగా పని చేస్తున్నారు. డిఆర్‌డిఎ పరిధిలో యానిమేటర్లు సుమారు 650 మంది పనిచేస్తున్నారు. 2019 అధికా రంలోకి వచ్చిన కొత్తలో యానిమేటర్లకు రూ.10 వేలు వేతనం ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. అయితే ఇంతవరకూ వారికి రూ. 10 వేలు ఇచ్చిన దాఖలాలు లేవు. కేవలం రూ.8000 చెల్లించి ప్రభుత్వం చేతులు దులుపుకుంటోంది. వైసిపి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడిచిన రూ 10 వేల వేతన హామీ నీటి మీద రాతలు గానే మిగిలిపోయింది. సాంకేతిక కారణాల పేరుతో ప్రతినెల వేతన చెల్లింపులు ప్రక్రియ స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. కరోనా సమయంలో వ్యాక్సినేషన్ సేవలందించినప్పటికీ కనీస గుర్తింపు లభించకపోగా వేతనాలు కూడా ఆగిపోయాయి. ప్రతి ఏటా ఆందోళనల నేపథ్యంలో మూడు నెలకోసారి లేదా ఐదు నెలలకు ఒకసారి వేతనాల చెల్లింపులు జరుగుతున్నాయి. నెలలు తరబడి వేతనాలు ఆగిపోవడంతో వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

వెట్టిచాకిరీ.... వేధింపులు...

రోజు రోజుకు వెట్టిచాకిరీ పెరుగుతుంది. అధికారుల వేధింపులు అధిక అవుతున్నాయి. డ్వాక్రా గ్రూపుల సమావేశాలు నిర్వహించి వారి అభివృద్ధికి తోడ్పడడం, గ్రూపులకు రుణాలు ఇప్పించడం, మొబైల్ బుక్ కీపింగ్, బ్యాంకు లింకేజ్ ద్వారా ఉన్నతి, స్త్రీనిధి, ఆసరా వంటి పథకాలను మహిళలకు అందుబా టులోకి తేవడం ఈ సిబ్బంది ప్రధాన విధులు అని అధికారులు చెబుతున్నారు. అయితే తాజాగా ఓటీఎస్ వసూళ్లు, జగనన్నతోడు పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేయడం, రుణాలు ఇప్పించడం, బ్యాంకు చుట్టూ తిరిగి టిడ్కో ఇళ్లకు రూ.35 వేల రుణా లు ఇప్పించడం, కొత్త గ్రూపులను ఏర్పాటు చేయించడం వంటి అదనపు పనులు కేటాయిస్తున్నారు. పట్టణాల్లో చెత్త సేకరణ సైతం వినియోగించుకుంటుండంతో ఆవేదనకు గురవుతున్నారు. విధి నిర్వ హణలో భాగంగా ప్రతిరోజు వర్క్ డన్ బాధ్యతను అప్పజెప్పారు. ఇతర పనులు అధికమవడం, మొబైల్ నెట్‌వర్క్ సాంకేతిక కార ణాల నేపథ్యంలో అధిక శాతం మంది ఈ పని చేయలేక పోతు న్నారు. వర్క్ డన్ చేయని కారణంగా వేతనాల్లో కోత విధించటం పరిపాటిగా మారింది. అదేవిధంగా ప్రభుత్వాలు మారిన ప్రతిసారి రాజకీయ వేధింపులు పరిపాటిగా మారుతున్నాయి. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



డిఆర్‌డిఎ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రిసోర్స్‌పర్సన్స్ (ఫైల్ ఫోటో)

పని ఒత్తిడి పెంచుతున్నారు

సుమారు 10 రకాల పనులు చేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వం 8000 మాత్రమే గౌరవ వేతనం ఇస్తోంది. ప్రస్తుత ధరలతో పోలిస్తే ఇది చాలా తక్కువ. కనీస వేతనం చెల్లించాలి. సిబిఓ,హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, రూ.10 లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి. విఓఎల మెర్జ్ ఆపాలి. అన్నిరకాల బకాయిలు ఇవ్వాలి. విఓఎల మెర్జ్ వల్ల ఉపాధి కోల్పోయిన వారికీ నష్టపరిహారం ఇవ్వాలి. లోకోస్ యాప్ కోసం 5జి మొబైల్స్ ఇవ్వాలి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి, రాజకీయ వేధింపులు ఆపాలి. పని ఒత్తిడిని తగ్గించాలి.

- బి రాజులోవ, సిఐటియు జిల్లా కార్యదర్శి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ జాతీయ నాయకురాలు అక్కినేని వనజ

జగన్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

- చంద్రబాబుపై కేసు ఎత్తకపోతే ప్రజా ఉద్యమం తప్పదు
- రౌండ్ టేబుల సమావేశంలో అఖిలపక్షం హెచ్చరిక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆర్థిక నేరస్తుడు జగన్ రెడ్డి పాలన సాగిస్తున్న రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని, అందుకే ప్రజా ఉద్యమాలను ఉక్కు పాదంతో అణిచివేయ బడుతున్నాయని అఖిలపక్షం మండిపడింది. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో నగరంలో అఖిలపక్షం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, జనసేన పార్టీ అర్బన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ అనుశ్రీ సత్యనారాయణ, నగర జనసేన అధ్యక్షుడు వై.శ్రీను, సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్, సిపిఎం జిల్లా నాయకులు ఎస్ఎస్ మూర్తి, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు బాలేపల్లి మురళీధర్ రావు, ఇతర ప్రజాసంఘాల నాయకులు మాట్లాడారు. సిఎం జగన్ అరాచక పాలనను ప్రతి ఒక్కరు ఖండించాలని అన్నారు. రాష్ట్రంలో ప్రజావేదిక కూల్చివేతలో ప్రారంభం అయిన జగన్ నియంతృత్వ పరిపాలన మాజీ సిఎం చంద్రబాబు అరెస్టుతో పరా కాష్టకు చేరిందన్నారు. ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టులకు పాల్పడటం, గృహ నిర్బంధానికి గురిచేయడం, లాఠీలతో కొట్టించడం, వైసిపి గూం డాలతో దాడులు చేయించడం పరిపాటిగా మారాయని మండిపడ్డారు. రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపడం చాలా దారు ణమని అన్నారు. ఎవరి కళ్ళల్లో ఆనందం కోసం సిబిసిఐడి పని చేస్తుందని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికై నియంతల పరిపాలన చేస్తున్నారని దుయ్య బట్టారు. ఈ రాష్ట్రంలో వైసిపిని ఓడించడం ద్వారానే రాష్ట్రంలో తిరిగి ప్రజాస్వామ్యాన్ని కాపాడు కోవచ్చన్నారు. జగన్ లాంటి నియంతకు రాబోయే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. చంద్ర బాబుపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయకపోతే రాష్ట్రంలో ప్రజా ఉద్యమం తప్పదని వారు హెచ్చరిం చారు. పౌర హక్కుల సంఘం అధ్యక్షులు ముప్పాళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ వైసిపి ప్రభు త్వం సిఐడిని జేబు సంస్థగా మార్చేసిందని ఆరోపించారు. జైల్లో ఉన్న చంద్రబాబును ఆయన సతీమణి ములాఖత్‌కు దరఖాస్తు చేసుకుంటే నిబంధనలు వర్తిం చవని చెబుతున్న జైలు అధికారులు దళిత యువకుడిని హత్య చేసి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన వైసిపి ఎంఎల్‌సి అనంతబాబుకు వర్తించని జైలు నిబంధనలు ఓ మాజీ ముఖ్యమంత్రికే వర్తిస్తాయా? అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో టిడిపి నగర అధ్యక్షుడు రెడ్డి మణి, సిపిఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, ప్రజాసంఘాల నాయకులు వైరాల అప్పారావు, రాచపల్లి ప్రసాద్, ద్వారా పార్వతి సుందరి, నల్లా రామారావు, యడ్ల లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి - పెరవలి

మండలం ఖండవల్లి గ్రామానికి చెందిన కూనపరెడ్డి నాగరాజు సహజ మరణం చెందడంతో ఆ కుటుంబానికి తక్షణ సహాయం క్రింద వైఎస్ఆర్ బీమా పథకం ద్వారా రూ.10,000లను ఎంపిపికాచర్ల సీతారాం ప్రసాద్ చేతుల మీదుగా ఆదివారం నామినీకి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ కుటుంబ యజమాని కోల్పోయి శోక సముద్రంలో మునిగిన కుటుంబానికి నేను ఉన్న, అంటూ భరోసా కల్పిస్తున్న పథకం వైఎస్ఆర్ బీమా అని అన్నారు. పేదలకు అండగా నిలవాలని లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. వైఎస్ఆర్ బీమా సర్వేలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరిని గుర్తించి అందించడం జరుగుతుందని తెలిపారు. నాగు ఆర్కే, బుంగ నాగయ్య, వాలంటీర్ సతీష్ పాల్గొన్నారు.



బీమా సొమ్మును అందిస్తున్న ఎంపిపి ప్రసాద్

నిధుల మంజూరుపై హర్షం



మీడియాతో మాట్లాడుతున్న జువ్వల రాంబాబు

ప్రజాశక్తి - నిడదవోలు

పాలకుల నిర్లక్ష్యానికి నిలువ ుటద్దంగా ఉన్న నిడదవోలు ఆర్టీసి డిపో అభివృద్ధికి సిఎం జగన్ మోహన్ రెడ్డి రూ.6 కోట్లు నిధులు కేటాయిస్తూ చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నట్లు సిపిఎం జిల్లా నాయకుడు, డిపో సాధన పోరాట కమిటీ కన్వీనర్ జువ్వల రాంబాబు అన్నారు. స్థానికంగా ఆదివారం మీడియాతో మాట్లాడుతూ నష్టాలు వస్తున్నాయనే కారణంతో 2006లో నిడదవోలు ఆర్టీసి డిపో మూసి వేశారని, అప్పటి నుంచి సిపిఎం, సిఐటియు, ఇతర పట్టణ ప్రజా సంఘాలు."నిడదవోలు ఆర్టీసి డిపో సాధన పోరాట కమిటీ'ని ఏర్పాటు చేసుకుని సుదీర్ఘ పోరాటాన్ని సాగిస్తున్నాయని తెలిపారు. 2015లో అప్పటి సిఎం చంద్రబాబు నాయుడు ఎంఎల్ఎ శేషారావు కషితో డిపో తిరిగి పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించారని తెలిపారు.

టిడిపి రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి - నల్లజర్ల

టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అక్రమ అరెస్టును ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ నల్లజర్ల కూడలిలో రిలే నిరాహార దీక్ష ఆదివారం జరిగింది. ఈ దీక్షలో టిడిపి నాయకులు కె.ఉదయ భాస్కరరావు, గద్దె రవి, కె.సత్యనారాయణ, ఎం.నారాయణ, ఈ.శ్రీనివాసరావు, ఆర్. ఆదినారాయణ, ఎ.రాంబాబు, పి. రమణ పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

ప్రజాశక్తి - పెరవలి

మండలం అన్నవరపాడు గ్రామం లోని సిబిఐ మాజీ జెడి వి వి లక్ష్మీనారాయణ ఫౌండే షన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు జెడి ఫౌండేషన్ కన్వీనర్ పొప్పోప్పు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్య క్రమం జరిగింది. మండలంలోని పలు గ్రామాల్లో కన్పించిన వారికి వినాయక మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు. పర్యావరణాన్ని కాపాడేందుకు చేపట్టే చర్యల్లో భాగంగా గత మూడు సంవత్సరాలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జెడి ఫౌండేషన్ కన్వీనర్ పొప్పోప్పు నాగేశ్వరరావు తెలిపారు. వినాయక చవితిని ప్రజలందరూ ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.



మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న జెడి ఫౌండేషన్ ప్రతినిధి

కొవ్వొత్తులతో టిడిపి నిరసన

ప్రజాశక్తి - తాళ్లపూడి

చంద్రబాబు అరెస్టు నిరసిస్తూ మండలం లోని అన్నదేవ రపేటలో టిడిపి నాయకులు, కార్య కర్తలు ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు యువకులు మాట్లాడుతూ ఐటీ రంగంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి ఎనలేని కషి చేసిన చంద్రబాబుపై అక్రమ కేసులు ఎత్తివేసే వరకు వివిధ రూపాలలో తమ నిరసనలు కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు కాకర్ల సత్యేంద్ర, తొండేపు భరత్, కూచిపూడి నరేంద్ర, మద్దుకూరి అనిల్, కూచిపూడి జగన్, గన్నిన అమ్మిరాజు, కూచిపూడి విజయ్, పి రాజు, ఐ బాలరాజు, బి మధు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న తెలుగు యువత ప్రతినిధులు

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

విరాట్ విశ్వకర్మ జయంతి ఉత్సవాలను భక్తిశ్రద్ధ లతో అత్యంత ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ ఎలు జక్కంపూడి రాజా, సత్తి సూర్యనారాయణ రెడ్డి, వైసిపి రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో ఎన్నో యంత్ర పరికరాలు అందుబాటులో వచ్చినప్పటికీ చేతి వత్తుల ద్వారా చేసిన వస్తువులకు యంత్రాల ద్వారా చేసిన వస్తువులకు నాణ్యత, మన్నికలో ఎంతో వ్యత్యాసం ఉంటుందన్నారు. వారి నైపుణ్యత ఏమిటో మనకు స్పష్టంగా అర్థమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండుగ ప్రకటించడం ఎంతో సంతోషించదగిన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరి రాధిక, అనుసూరి పద్మలత, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విశ్వకర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎలు

షాదీ ఖానాకు నిధుల మంజూరుపై హర్షం

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు ముస్లిం షాదీ ఖానా అభివద్ధికి సిఎం జగన్మోహన్ రెడ్డి నిధులు మంజూరు చేయడం పట్ల జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ వజీరుద్దీన్ హర్షం వ్యక్తం చేశారు. సిఎంను షాదీ ఖానా అభివృద్ధికి నిధులు మంజూరు చేసేలా ఒప్పించిన ఎంఎల్ఎ జి శ్రీనివాస్ నాయుడుకి మైనార్టీ సెల్ తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొత్తపల్లి సుప్రియ, ఎండి షాకిరా బేగం, అహ్మదున్నీసా బేగం, వైసిపి నాయకులు ఎండి ఫయాజ్, అప్సర్ జానీ బేగ్, అబ్దుల్ రెహ్మాన్ ఖాన్ పాల్గొన్నారు.

ఉచితంగా సుగర్, బిపి పరీక్షలు

ప్రజాశక్తి - నిడదవోలు

రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్ టౌన్ ఆధ్వర్యంలో రొటేరియన్ గాలి.రాఘవయ్య ఆర్థిక సహకారంతో ఆదివారం నిడదవోలు గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురుగా షుగర్ మరియు బిపి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 136 మందికి పరీక్షలు చేశారు. షుగర్ లక్షణాలు గల వారికి తగు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సలహాదారు ఇంజే శేఖర్, క్లబ్ ట్రైనర్ పెచ్చెట్టి.ఫణిసింహ, వైస్ ప్రెసిడెంట్ గుబ్బల.సత్య ప్రసాద్, సభ్యులు ఆనందం.మురళీకష్ణ, ఎల్లె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలుపై వరాలు కురిపించిన సిఎం

ప్రజాశక్తి - నిడదవోలు

సిఎం జగన్ నిడదవోలు నియోజకవర్గానికి వరాల జల్లు కురిపించారని ఎంఎల్ఎ శ్రీనివాస నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. స్థానికంగా ఆయన ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. నాలుగో ఏడాది వైఎస్ఆర్ కాపు నేస్తం ద్వారా లబ్ధిదారులు ఖాతాల్లో జమ చేసే రాష్ట్రస్థాయి కార్యక్రమం నిడదవోలులో విజయవంతమైందని తెలిపారు. సిఎం సమక్షంలో తాను ప్రస్తావించిన అన్ని సమస్యలను పరిష్కరించేందుకు ఆయన సానుకూలంగా స్పందించడమే కాకుండా నిధులను మంజూరు చేసేలా ఆదేశాలు జారీ చేసినందుకకాయన కృతజ్ఞతలు తెలిపారు. సిఎం పర్యటనను విజయవంతం చేసేందుకు సహకరించిన అధికార యంత్రాంగానికి, పార్టీ నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. గత నాలుగేళ్ల పాలనలో నియోజకవర్గంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ. 1300 కోట్లను లబ్ధిదారుల ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. అలాగే రూ.125 కోట్లతో రహదారులను వేశామని తెలిపారు. రూ.1600 కోట్ల విలువ చేసే పనులు టెండర్ల దశలో ఉన్నాయని చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ ఛైర్మన్ వై బాలరాజు, ఏఎంసి ఛైర్మన్ అయినీడి పుల్లారావు, షేక్ వజూద్దీన్, గాజుల రంగారావు, గోపిరెడ్డి శ్రీను, కొత్తపల్లి సుప్రియ, తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

కార్టూ'నిజం'



పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా భావించి వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక ప్రతిమలతోనే పూజలు నిర్వహించుకోవాలని ఎంపి భరత్ పిలుపునిచ్చారు. నగరంలోని క్వారీ మార్కెట్ సెంటర్లో ఆదివారం వైసిపి నాయకులు అజ్జరపు వాసు ఆధ్వర్యంలో 1500 మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపి మార్గాని భరత్ రామ్, అర్బన్ నియోజకవర్గం వైసిపి కోఆర్డినేటర్ డా.గూడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి భరత్ రామ్ మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాలను మాత్రమే ఏర్పాటు చేసుకుని తమ భక్తిని చాటు కోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గుర్రం గౌతం, నక్క శ్రీ నగేష్, అజ్జరపు ఫాలోవర్స్ అజ్జరపు రమేష్ బాబు, పేపర్ మిల్లు రమేష్, మణికంఠ రెడ్డి, రెబాక నాగేశ్వరరావు, కాలెపు దొరబాబు, అబ్బిరాజు, సుధాకర్, బంటి, లోకేష్, హరీష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతిని పూజిద్దాం, పర్యావరణాన్ని కాపాడదాం అనే నినాదంతో ఆర్తి స్వచ్ఛంద సేవా సంస్థ, సిసిసి ఛానల్ సంయుక్త ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణి చేశారు. ఆదివారం ఉదయం ఎ.వి.అప్పారావు రోడ్డులోని శ్యామలానగర్ శివా లయం సెంటర్లో సంస్థ అధ్యక్షుడు ఎస్.ఎన్.రాజా, పంతం కొండలరావు, బుడ్డిగ శ్రీనివాస్ తదితరుల చేతుల మీదుగా మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు ఉచితంగా అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాదుల హరినాథ్, కృష్ణ కుమార్, గొర్రెల సురేష్, కంచుమర్తి చంటి, అశోక్ కుమార్ జైన్, పాల్గొన్నారు.



మట్టి వినాయక ప్రతిమలను అందిస్తున్న ఎంపి భరత్

యువజన కాంగ్రెస్ నిరసన



టీలు, సమోసాలు అమ్మకం చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జాతీయ నిరుద్యోగ దినోత్సవం సందర్భంగా జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుడు బిల్డర్ బాబి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత టీ, సమోసాలు విక్రయించి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు డి.వి.శ్రీనివాస్ ఆదేశాలతో చేపట్టిన ఈ నిరసన కార్యక్రమం స్టేడియం రోడ్డులో సమోసా, టీ దుకాణం ఏర్పాటు చేసి అమ్మకాలు సాగించారు. మోడీ, జగన్ పాలనలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేసిన రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఇక మాకు ఇదే గతి అంటూ టీ, సమోసాలు అమ్మకం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ అధికారంలోకి రాకముందు దేశంలోని యువతకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి ప్రధాని కాగానే మాట తప్పారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మద్రా అరుణ్ కుమార్, మోర్త అమర్, తలారి నవీన్, మోర్త అఖిల్, రెల్ల శ్రీను, మందపల్లి రమేష్, గురుమూర్తి, కాకి భాస్కర్, పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుపై తెలుగు తమ్ముళ్లు దీక్ష

ప్రజాశక్తి - చాగల్లు

టిడిపి అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా స్థానిక ఊనగట్ల సెంటర్లో ఆదివారం తెలుగు తమ్ముళ్లు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. తక్షణమే చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కరుటూరి సతీష్, లకంసాని రాజేష్, కోడూరి ప్రసాద్, గన్నమని పార్థసారథి, గన్నమని రామకష్ణ, రావిపాటి శ్రీ కష్ణ, వల్లభనేని సాయి కష్ణ. బొడ్డు రాజు, కరటూరి శివ, మద్దిపాటి వీర రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్టలో విధి, విధానాలు పాటించాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని తీసుకున్న విధి, విధానాలను పాటించి వినాయక చవితిని నిర్వహించుకోవాలని ఎస్ఐ కె.రామారావు సూచించారు. వినాయక మండపం, విగ్రహం ఏర్పాటు గురించి ముందస్తుగా పోలీసు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, మండపం వద్ద, జరుగు చర్యలకు కమిటీ పూర్తి బాధ్యత వహించాలని, ఎటువంటి గొడవలు, అల్లర్లు లేకుండా సామరస్యంగా ఉండేలా ఉత్సవ కమిటీ బాధ్యత తీసుకోవాలన్నారు. విగ్రహ ప్రతిష్ట ప్రధాన రోడ్ల మీద, రహదారులను మూసివేస్తూ, వివాదాస్పద స్థలాలు, ఇతర మత ఆలయాల ప్రాంగణాలలో నిలబెట్టరాదని తెలిపారు. విగ్రహాలు నిలుపు ప్రదేశంలో తప్పకుండ పోలీసు శాఖ నుంచి మైక్ పర్మిషన్ తీసుకుని, సదరు మైక్‌లను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ఉపయోగించాలన్నారు. ఊరేగింపు సమయాలలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు, మద్యం, అశ్లీల నత్యాలు జరుగకుండా చూడాలన్నారు. విగ్రహ ప్రతిష్ట ప్రాంతంలోని పందిళ్ల వద్ద రాత్రి సమయాల్లో తప్పనిసరిగా ఒకరు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంటపాల పరిసర ప్రాంతాల్లో తాత్కాలిక సిసి కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని, నిత్య దీపారాధన వల్ల అగ్నిప్రమాదాల నివారణపై దృష్టి సారించాలన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరాలపై దాడి పదిమంది అరెస్ట్

ప్రజాశక్తి - రామచంద్రపురం

పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలోని దంగేరు శివారు పంట పొలాల వద్ద పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.10,250 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జానీ భాష తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇలా చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉప్పలగుప్తం ఎన్.కొత్తపల్లి పంచాయతీ రావులపేటలో పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రూ.2,900 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు తెలిపారు.

కల్వర్టును ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రమాదవశాత్తు నేషనల్ హైవేలో ఉన్న కాలువ కల్వర్టును ద్విచక్రవాహనంపై వెళ్తూ ఢీకొట్టిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు... పోలవరం మండలంలోని ఎల్ఎన్‌డి పేటకు చెందిన కట్టవ సత్యనారాయణ(60) దేవరపల్లి మండలం చిక్కాల గ్రామంలో ఉన్న తన కూతురు ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం 8.30 గంటల సమయంలో తిరిగి తన స్వగ్రామానికి వెళ్తూ గోపాలపురం శివారు పొగాకు బోర్డు సమీపంలో తాడిపూడి కాలువ సంబంధించిన నేషనల్ హైవేపై కల్వర్టును ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సత్యనారాయణకు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. శవ పంచనామా నిమిత్తం మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

సిఎం జగన్‌తోనే సంక్షేమం సాధ్యం

ప్రజాశక్తి - గోకవరం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సిఎం జగన్మోహన్ రెడ్డితోనే సంక్షేమ రాజ్యం సాధ్యమని మాజీ మంత్రి తోట నరసింహం అన్నారు. మండలంలోని గాదెలపాలెం గ్రామంలో వైసిపి నాయకులు తుమ్మలపల్లి గంగాధర్, గునిపే ఏడుకొండలు ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. 2024 లో మరొక్కమారు జగనే గెలిపించుకోవడానికి మనమందరం సైనికులుగా పనిచేయాలని అన్నారు. తోట రామ్‌జీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆత్మీయ సమావేశాలకు ప్రజా స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉందన్నారు. దాసరి చినబాబు, అత్తులూరి సాయిబాబా, తోట అయ్యన్న, షేక్ గఫుర్, రామకుర్తి మూర్తి, బదిరెడ్డి సుబ్బయ్యదొర, ఇజ్జిన కిరణ్ కుమార్, కురాకుల సుమంగళి, పత్తి రమేష్ పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి కృషి

పశుసంవర్ధక శాఖ జెడి వెంకటరావు





ప్రజాశక్తి- అమలాపురం

జిల్లాలో పశు సంపదను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, జిల్లాలో పాడి రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని, రైతు భరోసా కేంద్రాల ద్వారా పశు వైద్య సేవల్ని అందిస్తున్నామని అంబేద్కర్ కోనసీమ జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కె.వెంకటరావు తెలిపారు. పశువులకు బీమా, వ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత, ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ఆయన వివరించారు.

పాడి రైతుల సంక్షేమానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

పాడి రైతు సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది. ఇప్పటికే గ్రామాల్లోని పశువైద్య సహాయకులను నియమించడంతో వారు రైతులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఇప్పటివరకూ మూగజీవాల అనారోగ్యానికి గురైతే రైతులు అందుబాటులో ఉన్న పశు వైద్య సిబ్బందిని సంప్రదించి మందులు వేసేవారు. దీంతో పశువులకు సరైన సమయంలో వైద్యం అందుబాటులోకి వచ్చింది.

పశువుల ఆరోగ్యానికి ఎటువంటి భరోసా కల్పిస్తున్నారు.

పశువుకు సంక్రమించిన వ్యాధి ఏమిటో కచ్చితంగా తెలిసేది కాదు. వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల (లేబొరేటరీ) అందుబాటులో లేకపోవడంతో పశువులు చనిపోయి రైతులు నష్టపోయేవారు. లేబరేటరీలు ఉంటే పశువులను కాపాడచ్చని గ్రహించిన సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. తద్వారా మూగజీవాల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోంది.

జిల్లా కేంద్రంలో ల్యాబ్ ఎంతవరకు పనిచేస్తుంది..?

జిల్లా కేంద్రంలో రీజినల్ ల్యాబ్ భవన నిర్మాణం పూర్తయింది. త్వరలోనే ఇక్కడ ల్యాబ్ ప్రారంభమవుతుంది. ఇతర పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పశువులు అనారోగ్యానికి గురైతే సమీపంలోని పశు వైద్యశాలల్లో సిబ్బంది వైద్యం చేస్తున్నారు. కింది పశు వైద్యశాలల్లో ప్రయోగశాలలు లేకపోవడంతో పశువులకు ఏ వ్యాధి సోకిందో కచ్చితంగా తెలియడం లేదు. వ్యాధి నిర్ధారణకు జిల్లా కేంద్రంలోని ల్యాబ్‌కి రక్త నమూనాలు పంపిస్తున్నారు. ఆ రిపోర్టులు వచ్చేసరికి వ్యాధి తీవ్రమై పశువులు మరణిస్తున్నాయి. దీంతో పాడి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి ఒక వెటర్నరీ లేబొరేటరీని అందుబాటులోకి తీసుకువస్తోంది.

ఎన్ని ల్యాబ్ లు అందుబాటులోకి వస్తున్నాయి.

జిల్లాలో 7 నియోజకవర్గాలు ఉండగా జిల్లా కేంద్రంలో రీజనల్ ల్యాబ్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అమలాపురం సహ జిల్లాలో 7 నియోజకవర్గాల్లో పశువుల వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలు ఏర్పాటు చేశారు. ఈ ప్రయోగశాలల్లో కూడా పశువులకు సంబంధించిన వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

అన్ని పరీక్షలు ఒకే చోట నిర్వహిస్తారా.

ఈ ప్రయోగశాలల్లో అనారోగ్యానికి గురైన పశువులకు అన్ని రకాల పరీక్షలు చేస్తారు. ఆ ఫలితాలు వెంటనే రావడం వలన సత్వరమే అవసరమైన వైద్యాన్ని అందిస్తారు. ప్రతి నియోజకవర్గ కేంద్రానికి ఒక ల్యాబ్ టెక్నీషియన్, ల్యాబ్ అటెండర్‌ను నియమించారు. ఇప్పటికే ల్యాబ్ టెక్నీషియన్లు పని చేస్తున్నారు. ఈ ల్యాబ్ లకు భవనాలను ఏపి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా చేపట్టారు.

పశువధను నిరోధించేందుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి.

జిల్లాలో పశు విక్రయాలు, పశువుల వధ అంశాలపై ప్రభుత్వం 2014 లో ప్రివెన్షన్ ఆఫ్ క్రూయాలిటీ టు ఏనిమల్ రూల్స్ అనే చట్టాన్ని విడుదల చేసింది. ఈ చట్టం ప్రకారం పశు విక్రయాలను, వధలను నిరోధిస్తారు. 2014 లో అప్పటి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ నీతూ కుమారి హయాంలో కమిటీ ఏర్పడింది. జిల్లా కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా పోలీసు, ట్రాన్స్‌పోర్టు, రెవెన్యూ, పశు సంవర్ధక శాఖ, ఒక ఎన్జీఓ, జంతు ప్రేమికులు కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఎక్కడైనా పశు వధ జరిగినట్లు సమాచారం వస్తే ఈ కమిటీ చర్యలు తీసుకుంటుంది. నూతనంగా ఏర్పడిన జిల్లా కాబట్టి కమిటీ ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ఇప్పటికే ప్రతిపాదన పంపారు.

యానాం వార్తలు

రమాబాయి నగర్ అభివృద్ధి కమిటీ ఎంపిక

ప్రజాశక్తి - యానాం

స్థానిక మెట్టకూరు రమాబాయి నగర్ అభివృద్ధి కమిటి ఎంపికైంది. ఈ నూతన కమిటి అధ్యక్షులుగా ఇసుకపట్ల విశ్వనాథం, ఉపాధ్యక్షులుగా బూలా బాలు, సెక్రటరీగా జిల్లెల్ల చిరంజీవి, జాయింట్ సెక్రటరీగా కమిడి కష్ణ ప్రసాద్ దత్తు, కోశాధికారిగా మట్టపర్తి కష్ణ, గ్రామ పెద్దగా బొమ్మిడి శరత్ బాబు, ప్రత్యేక సలహాదారుడుగా యాళ్ల వెంకట్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులంతా గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

నిబంధనలను అతిక్రమించ వద్దు

ప్రజాశక్తి - పెరవలి

వినాయక చవితి సందర్భంగా పోలీసు శాఖ కొన్ని నిబంధనలను ప్రవేశపెట్టిందని, ఆ నిబంధనలను అతిక్రమించకుండా ఉత్సవ కమిటీలు నడుచుకోవాలని ఎస్ఐ ఎం.సూర్య భగవాన్ సూచించారు. మండలంలోని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో ఆదివారం ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో మండపాల వద్ద వినాయక ప్రతిమలు ప్రతిష్టించిన చోట ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా విగ్రహాలను ప్రతిష్టించుకోవాలని తెలిపారు. విద్యుత్ అలంకరణలో జాగ్రత్తలతోపాటు, తీన్మార్ డాన్సులు అతిక్రమించకూడదని అన్నారు. ప్రత్యార్థులపై తారాజువ్వలు వేయటం, ఇతరులను ఇబ్బంది కలగకుండా శబ్ద నియంత్రణ చర్యలను పాటించాలని తెలిపారు. ఊరేగింపు నిమజ్జనం రాత్రి వేళలో చేయరాదని, నిమజ్జన సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, మతపరమైన గొడవలు చేయరాదని సూచించారు.

చోరీ కేసుల్లో ముగ్గురు అరెస్టు

రూ.37.30 లక్షల సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి - అమలాపురం

దొంగతనాలు చేయడం. జైలుకు వెళ్లడమే వీరికి నిత్యకృత్యం. వివిధ దొంగతనాలు చేసిన ఒక ముఠాను పి.గన్నవరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ముఠాకు సంబంధించిన వివరాలను అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పి ఎస్.శ్రీధర్ మీడియా సమావేశంలో వెల్లడించారు. నిందితులు పిల్లి సింహాచలం, ముల్కీ మారుతి శ్రీ సాయి రామ్, వలపశెట్టి వీరబాబు నుంచి రూ.37,30,000 సొత్తు స్వాధీనం చేసుకున్నామన్నారు. 32 కేసుల్లో వీరు నిందితులన్నారు. చెడు వ్యసానాలకు అలవాటు పడి రాత్రి సమయంలో తాళాలు వేసి ఉన్న గృహాల్లో దొంగతనంగా ప్రవేశించి ఇంటి తాళాలు, తలుపు గెడలు బద్దలు కొట్టి బీరువాల్లో ఉన్న వెండి, బంగారం వస్తువులను దొంగిలించి జల్సాలు చేయడం అలవాటుగా చేసుకున్నారని తెలిపారు. పలివెల వంతెన దగ్గరలో మెయిన్ రోడ్డు ప్రక్కన వారు అద్దెకు ఉంటున్న ఇంటి దగ్గర ఈ ముగ్గురిని పి.గన్నవరం సిఐ ప్రశాంత్, ఎస్ఐ హరికోట శాస్త్రి అరెస్ట్ చేశారని తెలిపారు. మొదటి ముద్దాయి పిల్లి సింహాచలంపై తిమ్మాపురం, పెద్దాపురం, పిఠాపురం, పాలకొల్లు, సర్పవరం, కోటవురట్ల పోలీస్ స్టేషన్ ఏరియాల్లో జరిగిన పలు దొంగతనాలపై కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. పలు కేసుల్లో ముద్దాయి అయిన సింహాచలం 2 సంవత్సరాల 8 నెలలు రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండు ఖైదీగా ఉండి 2021 జూన్ నెలలో బెయిల్‌పై బయటకు వచ్చాడని వెల్లడించారు. తదనంతరంకోటవురట్ల పోలీసేస్టేషన్ కేసులో కోర్టు 2 సంవత్సరాలు జైలు శిక్ష విధించగా విశాఖపట్నం జైల్ నందు శిక్ష అనుభవించి బయటకి వచ్చాడని ఎస్పి తెలిపారు. రెండో నిందుతుడు ముల్కీ మారుతి శ్రీ సాయి రామ్‌పై కూడా సర్పవరం పోలీస్ స్టేషన్లో మోటార్ సైకిల్ దొంగతనం కేసు ఉందని, వీరు జైలు శిక్ష అనుభవించి ఆయా పరిధిలో రాత్రి తిరిగి వచ్చి మళ్ళీ దొంగతనాలు చేస్తూ ఆ తరువాత విలాసలు చేసే వారన్నారు. ఈ ముగ్గురు నిందుతుల నుంచి నుంచి 592.450 గ్రాముల బంగారం, దాని విలువ రూ. 33,00,000, 4 మోటార్ సైకిళ్లు, 3 టివిలు, 1 కెమెరా, 1 కెమెరా ఫ్లాష్ లైట్, ఒక హోం థియేటర్, ఒక మ్యూజికల్ గిటార్ మొత్తం విలువ రూ. 4,30,000 ఉంటుందన్నారు. ముగ్గురు నిందుతుల నుంచి స్వాధీనం చేసుకున్న వాటి విలువ మొత్తం విలువ రూ.37,30,000 ఉంటుందని ఎస్పి శ్రీధర్ తెలిపారు. నేరస్తులను చాకచక్యంగా అరెస్టు చేసేందుకు సహకరించిన కొత్తపేట డిఎస్పి కెవి.రమణ, పి. గన్నవరం సిఐ డి.ప్రశాంత్‌కుమార్, గన్నవరం ఎస్ఐ హరికోటి శాస్త్రి, అమలాపురం క్రైమ్ ఇన్‌స్పెక్టర్ గోవిందరావు, అమలాపురం క్రైమ్ ఎస్ఐ సంపత్ కుమార్, ఎఎస్ఐ బాలకృష్ణ, సిబ్బంది శేఖర్ రాజు, నాగేశ్వరావు, శ్రీను, రమణ, ప్రసాద్, కష్ణసాయి, సుభాకర్, అర్జునరావు, ప్రసాద్, హరిబాబు, శ్రీను, సతీష్, చిరంజీవిలను ఎస్పి అభినందించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు : మంత్రి

ప్రజాశక్తి - చాగల్లు

రాష్ట్రంలో ప్రతీ ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకం అందుతుందని మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని దారవరంలో ఆదివారం సచివాలయ భవనం, హెల్త్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవరత్నాల ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికి అమ్మ ఒడి, చేయూత, విద్యాదీవెన, జగనన్న విద్యా కానుక, జగనన్న చేదోడు, వివిధ రకాల పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రతి 50 ఇళ్లకు ఒక వాలంటీర్ ద్వారా ఇంటికి లబ్ధి చేకూరేలా కషి చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం ప్రజలకు ఏమి చేయకపోగా జన్మభూమి కమిటీల పేరుతో ఆఫీసుల చుట్టూ, నాయకుల చుట్టూ ప్రజలను తిప్పుకున్నారని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం ప్రతిపక్షాలన్నీ కలిసి పొత్తు కుదుర్చుకునేందుకు నాన్న తంటాలు పడుతున్నాయని, మళ్లీ ఎన్నికలు వస్తున్న సందర్భంగా గ్రామాల్లోకి మాయమాటలు చెప్పేందుకు నాయకులు వస్తుంటారని తెలిపారు. గత ప్రభుత్వంలో తమ గ్రామాల్లో ఎటువంటి అభివద్ధి పనులు చేశారో ప్రతిపక్ష నాయకులను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. సిఎం జగన్మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని తానేటి వనిత కోరారు. ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం సభాప్రాంగణం వద్ద సర్పంచ్ మద్దుకూరి రవిప్రసాద్ జన్మదిన వేడుకల్లో హోంమంత్రి తానేటి వనిత పాల్గొని రవిప్రసాద్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నిత్యం ఆయురారోగ్యాలతో ఆనందంతో ఉండాలని.. ప్రజలకు మరింత సేవలు అందించాలని ఆమె ఆకాంక్షించారు.



అర్తమూరులో దిగిపోయిన సిసి రోడ్డు

అర్తమూరులో ప్రమాదకరంగా సిసి రోడ్లు

ప్రజాశక్తి-మండపేట

అర్తమూరులో సిసి రోడ్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. గ్రామంలోని శ్మశాన వాటిక సమీపంలోని కాలువ వెంబడి ఉన్న సిసి రోడ్డు రెండు చోట్ల దిగిపోవడం, రామచంద్రపురం రోడ్డులోని తుపాకుల తూము వద్ద నుండి గ్రామంలోకి వచ్చే సిసి రోడ్డుకు గోతులు పడడంతో ఈ రోడ్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. దీంతో స్థానికులు, వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మధ్యకు విడిపోవడంతో రాత్రి సమయాల్లో ప్రజలు జారిపడుతున్నారని స్థానికులుచెబుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని వారు కోరుతున్నారు.



తాపేశ్వరం రోడ్డులో ఒరిగిన విద్యుత్ స్తంభం

పంట బోదెలోకి ఒరిగిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణ శివారు తాపేశ్వరం ప్రధాన రోడ్ లోని మెహర్ విద్యానికేతన్ సమీపంలో విద్యుత్ స్తంభం పంటబోదెలోకి ఒరిగిపోయింది. ఈ స్తంభానికి సపోర్ట్ గా వేసిన మరో స్తంభం విరిగిపోవడంతో పాటు పాదులు నిండుగా అలుము కున్నాయి. ఈ నేపథ్యంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా రోడ్డు గోతులమయంగా మారడంతో వాటిని తప్పించే ప్రయత్నంలోనే భారీ వాహనాలు దాటికి విద్యుత్ స్తంభం ఒరిగిపోతుందని పలువురు చెబుతున్నారు.ఇప్పటికైనా సంబంధం అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

డంపింగ్ యార్డులుగా రోడ్లు, కాలువ గట్లు

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛభారత్, స్వచ్ఛ సర్వేక్షణ్, మనం మన పరిశుభ్రత, వ్యర్థాలపై వ్యతిరేకపోరాటంతోపాటు పారిశుధ్యంపై అవగాహన వంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మెరుగుపడటం లేదు. సమస్య నానాటికీ తీవ్ర రూపం దాలుస్తోంది. ఆహ్లాదకరంగా ఉండాల్సిన రహదారులు, కాలువ గట్లు డంపింగ్ యార్డులుగామారి దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో తాము వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు, ప్రయాణీకులు వాపోతున్నారు. ఇవి కుక్కలకు, పందులకు, దోమలు.క్రిమికీటకాలకు ఆవాసాలుగా మారుతుండటంతో రాత్రి సమయాల్లో దోమలు కంటి మీదకునుకు లేకుండా చేస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు.ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు మారుతున్నా సమస్యల పరిష్కారానికి నోచుకోవడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. మూతపడ్డ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తెరిచి, చెత్తను అక్కడికి తరలించాలని కోరుతున్నారు. పచ్చదనం, పరిశుభ్రతను కాపాడే విధంగా అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



అర్తమూరు రోడ్డులో కాలువ చెంతనే పేరుకుపోయిన చెత్త

సూర్యనగర్‌లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-అమలాపురం

వైసిపి నాయకులు, తుని నియోజ కవర్గ ఎన్నికల పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు 51వ పుట్టినరోజు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆదివారం అమలాపురం సూర్యనగర్‌లో అభిమానులు రక్తదాన శిబిరాన్ని నిర్వహిం చారు. సుమారు 100 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో చెల్లుబోయిన శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ దంగేటి డోలమని రుద్ర, కౌన్సిలర్ డి.రాము, దొంగ చిన్న, కేతా భానుతేజ, రాజులపూడి మురళి, బండారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న దృశ్యం



పిచ్చి మొక్కలతో ఉన్న పార్క్

పార్కుల్లో కనీస సౌకర్యాలు కరువు

- 30వ వార్డులో పిచ్చి మొక్కలతో నిండిన పార్కు
- అభివృద్ధి చేయాలని కోరుతున్న ప్రజలు

ప్రజాశక్తి-మండపేట

పచ్చదనంతో కళకళలాడుతూ పట్టణ ప్రజలు సేద తీరేందుకు అనువుగా ఉండాల్సిన పార్కులు కనీస సౌకర్యాలు లేక నిరుపయోగంగా మారుతున్నాయి. పట్టణ పరిధిలోని 30వ వార్డులో ఉన్న రాజీవ్ గృహకల్ప కాలనీలో పార్కు పిచ్చి మొక్కలతో చిట్టి అడవిని తలపిస్తోంది. గత కొంతకాలంగా పార్కు ఈ విధంగానే ఉండి నిరుపయోగంగా మారుతుందని కాలనీ ప్రజలు అంటున్నారు.

కనీసం చిన్నారులు ఆడుకునేందుకు ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.